‘అపార్’ కష్టాలు!



పెదగంట్యాడ సచివాలయం వద్ద ఆధార్‌లో సవరణ కోసం వచ్చిన విద్యార్థులు, తల్లిదండ్రులు

- వన్ నేషన్..వన్ స్టూడెంట్ పేరుతో అపార్ కార్డులు
- డేటా సేకరిస్తున్న ఉపాధ్యాయులు
- టీసీ, బర్త్ సర్టిఫికెట్, ఆధార్‌లో తప్పులు
- అవస్థలు పడుతున్న విద్యార్థులు



సచివాలయం బయట నిరీక్షిస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

పెదగంట్యాడ: జాతీయ విద్యా విధానం అమల్లో భాగంగా ఆధార్ కార్డు తరహాలో విద్యార్థులకు ప్రత్యేక గుర్తింపు కార్డు అందించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఒకే దేశం–ఒకే విద్యార్థి అనే నినాదంతో విద్యార్థులకు 12 అంకెలతో కూడిన అపార్ '(ఆటోమేటెడ్ పర్మినెంట్ అకాడమీ అకౌంట్ రిజిస్ట్రీ) నంబర్ కేటాయించనున్నారు. యూడైస్ ప్లస్ వెబ్‌సైట్ వేదికగా జాతీయ స్థాయిలో అపార్ నెంబర్ కేటాయించి.. విద్యార్థికి సంబంధించిన సమస్త సమాచారం అందులో నిక్షిప్తం చేస్తారు. కేజీ నుంచి పీజీ వరకూ విద్యార్థులకు ఈ నెంబర్ కేటాయించనున్నారు.

సవరణ లేకపోవడమే ఇబ్బంది

అపార్ కలిగి ఉండడం ద్వారా దేశంలో ఏ రాష్ట్రంలో నైనా కాన్వొకేషన్ లేకుండా 12 అంకెల ఆధారంగా ఉన్నత విద్యనభ్యసించే అవకాశం ఉంటుంది. అయితే ఒకసారి కార్డు జారీ అయితే సవరణలకు అవకాశం లేదు. దీంతో ఆధార్‌లో సవరణ కోసం విద్యార్థులు, తల్లిదండ్రులు ఆధార్ కేంద్రాల చుట్టూ ప్రదక్షిణ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

వివరాల సేకరణ

విద్యార్థి బడిలో చేరినప్పటి నుంచి అన్ని అకడమిక్ వివరాలు, వ్యక్తిగత, కుటుంబీకుల చిరునామా, జనన ధృవ పత్రాలు, ఆధార్ ధ్రువ పత్రాలు, పాస్ పోర్టు సైజ్ ఫొటో, తల్లిదండ్రుల ఆధార్ తదితర సర్టిఫికెట్‌లు అపార్ నమోదుకు కావాలని ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రుల పై ఒత్తిడి తీసుకువస్తున్నారు. అయితే పైన పేర్కొన్న ధ్రువ పత్రాల్లో విద్యార్థి 1వ తరగతిలో చేరినప్పుడు అడ్మిషన్ రిజిస్టర్, ఉపాధ్యాయుడు, ఆన్‌లైన్ చేసిన వివరాలు, ఆధార్ కార్డులో వివరాలు ఒకే రకంగా ఉంటేనే అపార్ నంబర్ సులభంగా జారీ అవుతుంది. అలా కాకుండా ఏ చిన్న పొరపాటు ఉన్నా విద్యార్థికి అపార్ నెంబర్ రాదని చెబుతున్నారు. ఆధార్, జనన ధ్రువ పత్రాల్లో తప్పొప్పులను సవరించుకోవడానికి ఏడాది మొత్తం అన్ని గ్రామ, వార్డు సచివాలయాల్లో ఏర్పాట్లు చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఆధార్ కేంద్రాలకు పరుగులు

విద్యార్థులకు సంబంధించి నామినల్ రోల్స్ పంపాల్సి ఉంది.1వ తరగతిలో చేరే సమయంలో ఇంటి పేరు (సర్ నేం)తో నమోదు చేసుకుంటారు. సదరు ఉపాధ్యాయులు వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. ఆధార్‌కార్డుల జారీ సమయంలో ఇంటి పేరు లేకుండా కేవలం ఒక అక్షరం (ఇనీషియల్)తో నమోదు చేశారు. అలాగే పుట్టిన తేదీ ఏదో ఒకటి వేసేశారు. ప్రస్తుతం ఈ రెండే విద్యార్థులకు ప్రధాన సమస్యలుగా మారాయి.ఆధార్‌లో మార్పులు జరగాలంటే జనన ధ్రువీకరణ పత్రం తప్పనిసరి. అయితే చాలా మంది విద్యార్థుల వివరాలు తప్పుగా ఉన్నాయి. దీంతో ప్రభుత్వ కార్యాలయాలు, ఆధార్ కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

మార్పులకు నో చాన్స్

అపార్ కార్డు తీసుకునేందుకు తల్లి లేదా తండ్రి విద్యా సంస్థలకు వెళ్లాల్సి ఉంటుంది. ఇందుకోసం యూ డైస్ ప్లస్‌లో నమోదైన వివరాలు సరిచూసుకొని ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలి.దీన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ధ్రువీకరించాల్సి ఉంటుంది. విద్యార్థి ఆధార్‌కు అనుసంధానమైన ఫోన్ నెంబర్‌కు ఓటీపీ వస్తుంది. దాన్ని నమోదు చేసిన అనంతరం గుర్తింపు నెంబర్ జారీ అవుతుంది. ఆన్‌లైన్‌లో అపార్ కార్డు జనరేట్ అవుతుంది. ఒకసారి వెలువడిన కార్డులో సవరణకు అవకాశం ఉండదని అధికారులు చెబుతున్నారు.అందువల్ల అన్ని వివరాలు ముందే సరిచూసుకోవాలని సూచిస్తున్నారు.

ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయాలి



విద్యార్థుల ఆధార్‌లో వివరాల మార్పునకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.నా కుమారుడి ఆధార్ కార్డులో పేరు సవరణ కోసం వారం రోజులుగా ఆధార్ కేంద్రాలు చుట్టూ తిరిగాను. ప్రతి పాఠశాలలో ఆధార్ అప్‌డేట్ కోసం మొబైల్ కేంద్రాలు ఏర్పాటు చేయాలి.

– సీహెచ్ బ్రహ్మజీ, విద్యార్థి తండ్రి, పెదగంట్యాడ

83 శాతం పూర్తి



పెదగంట్యాడ మండలంలో ఇప్పటి వరకు 83 శాతం విద్యార్థుల వివరాలు నమోదు చేశాం. మిగిలిన విద్యార్థుల వివరాల కూడా సేకరించేందుకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృషి చేస్తున్నారు. అన్ని వివరాలు సేకరించిన తర్వాత అపార్ కార్డుల జారీ ప్రక్రియను ప్రారంభిస్తాం. తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. – ఇ. శ్రీనివాస్, ఎంఈవో–1 పెదగంట్యాడ

జీవితకాలం ఉపయోగం



ఆధార్ నెంబర్ మాదిరిగానే ప్రతి విద్యార్థికి అపార్ ఐడీ జనరేట్ అవుతుంది. విద్యార్థికి జీవితకాలం గుర్తింపుగా అపార్ ఐడీ ఉపయోగపడనుంది.అపార్ కార్డు ఒకసారి జారీ అయితే ప్రస్తుతానికి సవరణకు అవకాశం లేదు. అందు వల్ల నమోదు విషయంలో చాలా జాగ్రత్తగా ఉంటున్నాం.

– కంకటాల రమణాజీ, ఎంఈవో–2 పెదగంట్యాడ

హామీలు నెరవేర్చేవరకూ పోరాడతాం

సీపీఐ గాజువాక జోన్ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న కసిరెడ్డి సత్యనారాయణ

పెదగంట్యాడ: ఎన్నికల ప్రచారంలో కూటమి నాయకుల ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని సీపీఐ గాజువాక కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ డిమాండ్ చేశారు. జీవీఎంసీ 64వ వార్డు గంగవరం జాలరిపల్లి పాలెంలో సోమవారం ముఖ్యనాయకులతో సమావేశం నిర్వహించారు..ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలలు గడుస్తున్నా పేదలకు ఇంటి స్థలాల మంజూరుపై నోరు మెదపడం లేదన్నారు. ఎన్నికల ప్రచారంలోఇచ్చిన మాట ప్రకారం పేదలకు అర్బన్ పరిధిలో 2 సెంట్లు ,గ్రామాల పరిధిలో 3 సెంట్లు ఇంటి స్థలాలు మంజూరు చేయాలన్నారు. 2014 టీడీపీ ప్రభుత్వంలో ఇచ్చిన పట్టాలకు రిజిస్ట్రేషన్ హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు. టిడ్కో గృహాల లబ్ధిదారులకు వెంటనే ఇళ్లు అప్పగించాలన్నారు. ఇళ్లు ఇవ్వని వారికి కట్టిన మొత్తం వెనక్కి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కూటమి నాయకులు ఇచ్చిన హామీలు అమలు చేయాలనే డిమాండ్‌తో ఈ నెల 18న సచివాలయాల వద్ద ఆందోళన నిర్వహిస్తామని ప్రజలంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వై .నందన్న, పల్లేటి పోలయ్య, కెంగువ అచ్యుతరావు, పి పోతన్న, మాధవ రావు, సోమేష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సోలార్‌తో విద్యుత్ ఆదా



సోలార్ విద్యుత్ ఉపయోగాలపై అవగాహన కల్పిస్తున్న ఏఈ రిషికేష్

అగనంపూడి: సోలార్ విద్యుత్ వినియోగం వల్ల విద్యుత్ ఆదా అవడంతో పాటు విద్యుత్ బిల్లుల భారం తగ్గుతుందని ఈపీడీసీఎల్ ఏఈ రిషికేష్ చెప్పారు. జీవీఎంసీ 86వ వార్డు వుడా నగర్ ఫేజ్–1 పార్క్ వద్ద సోమవారం సోలార్ వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోలార్ ప్లాంట్‌లు ఏర్పాటు చేసుకుంటే రాయితీ అందిస్తామన్నారు. నిర్వహణ భారం కూడా ఉండదని విద్యుత్ ఆదా చేసుకొనే వెసులుబాటు కలుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో వుడా ఫేజ్ –1 అసోసియేషన్ కార్యదర్శి పీఆర్‌ఖాన్, ప్రతినిధులు ఎస్‌బీ చారులు భాస్కరరావు, శ్రీనివాసరావు, ఈపీడీసీఎల్ సిబ్బంది కొండలరావు, తాతబాబు తదితరులు పాల్గొన్నారు.

బంగారు పతక విజేతకు అభినందనలు



విద్యార్థిని తబసం పర్వీన్‌ను అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ తదితరులు

పెదగంట్యాడ: ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించి బంగారు పతకాన్ని కైవసం చేసుకున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల (ఇస్లాంపేట)కు చెందిన విద్యార్థిని తబసం పర్వీన్ కళాశాల ప్రిన్సిపాల్ సింహాద్రప్పడు అభినందించారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ ట్రస్ట్, ఆంధ్ర యూనివర్సిటీ సంయుక్తగా నిర్వహించిన జాతీయ విద్యాదినోత్సవంలో భాగంగా ఆ విద్యార్థినికి బంగారు పతకం, ప్రశంసాపత్రం అందజేశారు. ఈ మేరకు విద్యార్థినిని కళాశాలలో సోమవారం అభినందించారు.

నిరుపేద విద్యార్థికి చేయూత



విద్యార్థి శివరామకృష్ణకు నగదు అందిస్తున్న రామ అప్పారావు మిత్రబృందం

అగనంపూడి: పేదరికం కారణంగా చదువుకు దూరం కాకూడదనే ఆలోచనతో సమాచార హక్కు చట్టం కార్యకర్త పట్టా రామ అప్పారావు మిత్ర బృందం ఓ విద్యార్థికి ఆర్థిక సాయం అందించి ఉదారత చాటుకుంది. కాండ్రేగుల కుమార్ వెంకట శివరామ కృష్ణ టెన్త్, ఇంటర్‌లో టాపర్... కాని మెడిసిన్ చదవాలనే లక్ష్యానికి పేదరికం అడ్డంకిగా మారింది. విషయం తెలుసుకున్న అప్పారావు మిత్ర బృంద సభ్యులు సోమవారం రూ.11వేల నగదు అందించారు. నీట్ ప్రవేశ పరీక్ష కోచింగ్ కోసం అవసరమైన రూ.30వేల అందించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. గుదే సుశీలా గజేంద్రరావు, నిమ్మకూరి రమేష్, బొండా ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ

పెదగంట్యాడ: విజయవాడలో తుపాను కారణంగా ముంపునకు గురైన ప్రజలకు జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది చేసిన సేవలు ఎనలేనవని 77వ వార్డు కార్పొరేటర్ బట్టు సూర్యకుమారి అన్నారు. వార్డు పరిధిలోని అప్పికొండ శివాలయం ఆవరణలో వార్డుకు చెందిన పారిశుధ్య కార్మికులకు సోమవారం దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జీవీఎంసీ జోన్–6 ఏఎంహెచ్‌వో డాక్టర్ కిరణ్ కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అప్పలరాజు పాల్గొన్నారు.

పేదలకు అండగా ఉంటాం

అగనంపూడి: పేద బ్రాహ్మణులకు అండగా ఉంటా మని శ్రీ శారదా గాయత్రీ బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు ధర్మాల సుబ్బారావు అన్నారు. అగనంపూడి శాఖ ఆధ్వర్యంలో సోమవారం దువ్వాడలోని కుసుమ హరనాథ ఆశ్రమంలో వన సమారాధన చేపట్టారు. పేద బ్రాహ్మణులకు వివాహాలు, చదువుల కోసం సహకారం అందిస్తున్నామన్నారు. ఏబీఎఫ్ రాష్ట్ర కోఆర్డినేటర్ ధర్మాల వ్యాసశర్మ, పి.సుధాకర్, కొత్తలంక సూర్యనారాయణ, ఎస్‌వీసీహెచ్ పాల్గొన్నారు.

ప్రతిధ్వనించిన పంచాక్షరి



ఉక్కు బీసీ గేటు శివాలయంలో పూజలు

కిటకిటలాడిన శైవక్షేత్రాలు



అక్కిరెడ్డిపాలెం ఉమారామలింగేశ్వరాలయంలో కిక్కిరిసిన భక్తులు



అయ్యప్ప దేవాలయంలో రుద్రాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు



వాసవీ పంచాయతన ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకుడు

పెదగంట్యాడ: కార్తీక మాసం రెండో సోమవారం సందర్భంగా శివాలయాలకు భక్తులు పోటెత్తారు. వేకువ జాము నుంచే ఆలయాలకు చేరుకుని పరమేశ్వరునికి ప్రత్యేక పూజలు చేశారు. హరహర మహాదేవ నామస్మరణను హోరెత్తించారు. భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. తులసికోట, ధ్వజస్తంభం, నందీశ్వరుని, ఉసిరి చెట్టు వద్ద దీపారాధన చేశారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆయా ఆలయాల కమిటీలు ప్రత్యేక ఏర్పాట్లు చేశాయి.

➡ జీవీఎంసీ 77వ వార్డు పరిధిలోని అప్పికొండ సోమేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహించారు. స్వామివారిని ఏఎంహెచ్‌వో డాక్టర్ కిరణ్‌కుమార్ తదితరులు దర్శించుకున్నారు.

➡ జీవీఎంసీ 76వ వార్డులోని బాలచెరువు ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో పార్వతీపరమేశ్వరులను ప్రత్యేకంగా అలంకరించి పంచామృతాలతో అభిషేకాలు, హోమాలు, రుద్రాభిషేకాలు చేశారు.

➡ హౌసింగ్ బోర్డు కాలనీ సమీపంలోని వాసవీ పంచాయతన ఆలయంలో పూజలకు భక్తులు భారీగా తరలివచ్చారు.

➡ వుడా కాలనీ, గాంధీనగర్‌లోని శివాలయంలో పార్వతీపరమేశ్వరులకు అభిషేకాలు, అర్చనలు చేశారు. సాయంత్రం ఆయా ఆలయాల్లో ప్రత్యేక కుంకుమార్చనలు నిర్వహించారు.

మార్మోగిన హరనామ స్మరణ

అక్కిరెడ్డిపాలెం: కార్తీక మాసం రెండో సోమవారం కావడంతో అక్కిరెడ్డిపాలెం, నాతయ్యపాలెం, షీలానగర్, రాంనగర్, మింది, ఆటోనగర్ తదితర ప్రాంతాల్లోని శివాలయాలకు భక్తులు పోటెత్తారు. వేకువ జామునే ఆలయాలకు చేరుకుని పరమేశ్వరుడికి విశేష పూజలు నిర్వహించారు. ఆలయాల ఎదుట ధ్వజస్తంభాల వద్ద భక్తులు దీపారాధన చేపట్టారు.

ఉక్కు శివాలయాల్లో కార్తీక పూజలు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లోని శివాలయాలు సోమవారం భక్తులతో పోటెత్తాయి. సెక్టర్–6 శివాలయంలో భక్తులు బయట వరకు బారులు తీరారు. ఈ సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు చేశారు. వేకువ జామున గోత్ర నామ పూజలు, సాయంత్రం జ్యోతిర్లింగార్చన నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. – బీసీ గేటు సమీప ఉమా సహిత రామలింగేశ్వర స్వామి ఆలయంలో పెద్ద ఎత్తున పూజలు చేశారు. రుత్వికుల ఆధ్వర్యంలో హోమాలు నిర్వహించారు. ఉద్యోగులు, కాంట్రాక్ట్ సిబ్బంది ఉమా రామలింగేశ్వరులను పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు.

➡ రవీరేస్ సమీప పురాతన శివాలయంలో వేకువ జాము నుంచి పరమేశ్వరునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. కణితి, వడ్లపూడి కాలనీలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు.

హరోం..హర

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్ అయ్యప్ప స్వామి దేవాలయంలో ఈశ్వరునికి రుద్రాభిషేకాలు ఘనంగా జరిగాయి. కార్తీక శుద్ధ సోమవారం సందర్భంగా అయ్యప్ప దీక్ష స్వీకరించిన స్వాములు, తమ కుటుంబ సభ్యులతో అభిషేకాల్లో పాల్గొన్నారు. అంతకు ముందు ఆలయ ప్రధానార్చకుడు నాగేశ్వర శర్మ నేతృత్వంలో అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. అనంతరం భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ప్రధాన కాలువపై అడ్డంకులు తొలగించండి

జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్



కాలువను పరిశీలిస్తున్న కమిషనర్ సంపత్ కుమార్

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు షీలానగర్ పెట్రోల్ బంక్ సమీపంలోని ప్రధాన కాలువపై అడ్డంకులు తొలగించాలని జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన జీవీఎంసీ, గెయిల్ అధికారులతో కలిసి ప్రధాన కాలువలపై అడ్డంకులు కలిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. సమస్యపై ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్ వివరిస్తూ కాలువ మేహాద్రి గెడ్డ నుంచి నరవ మీదుగా పారుతుందని, 20 అడుగుల వెడల్పుగల ప్రధాన కాలువ గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (గెయిల్) రక్షణ గోడకు ఆనుకొని వెళుతుందని తెలిపారు. ఏడాది నుంచి గెయిల్ యాజమాన్యం కాలువను మూసి వేయడంతో కాలువ సాఫీగా పారేందుకు అడ్డంకులు ఏర్పడ్డాయన్నారు. భారీ వర్షాలకు వరదల సంభవించినప్పుడు చెరువు మాదిరిగా ఈ ప్రాంతం మంతా మారడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారని వివరించారు. దీంతో స్పందించిన కమిషనర్ కాలువ ఎందుకు మూసివేశారో వివరణ ఇవ్వాలని గెయిల్ అధికారి మూర్తిని ఆదేశించారు. వెంటనే గెయిల్ యాజమాన్యంతో సమావేశం ఏర్పాటు చేసి ప్రధానకాలువ సాఫీగా పారేలా చర్యలు చేపట్టాలనిఆదేశించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి గుడివాడ లతీష్, జెడ్సీ బి.ఆర్.ఎస్.శేషాద్రి, పర్యవేక్షక ఇంజినీర్ గోవిందరావు, కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు రెసిడెన్షియల్ శిక్షణ రద్దు చేయాలి



సమావేశంలో పాల్గొన్న ఏపీటీఎఫ్ నాయకులు

గాజువాక: ఉపాధ్యాయులకు ఇస్తున్న రెసిడెన్షియల్ శిక్షణ తరగతులను వెంటనే రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) గాజువాక జోన్ నాయకులు డిమాండ్ చేశారు. పాతగాజువాకలో సోమవారం నిర్వహించిన సమావేశంలో వివిధ సమస్యలపై చర్చించి పలు తీర్మానాలను ఆమోదించారు. జీవో నంబర్ 117ను రద్దు చేయాలని, ఉపాధ్యాయుల పీఎఫ్, సరెండర్ లీవుల బకాయిలను చెల్లించాలని తీర్మానించారు. వచ్చే ఏడాది జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి ఏపీటీఎఫ్ అభ్యర్థిగా పాకలపాటి రఘువర్మ పోటీ చేయనున్నారని ఆయనకు మద్దతు తెలపాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కరుణాకరరావు, రామకృష్ణారావు కోరారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు రాజాన మంగమ్మ, ఎస్.వి. జయశ్రీ, ప్రకాశరావు, జి.నాగభూషణరావు తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో జీవితాలు బుగ్గి



ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఎస్పీ సత్యనారాయణ తదితరులు

అగనంపూడి: మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారొద్దని, వాటికి దూరంగా ఉండాలని విద్యార్థులకు పరవాడ డీఎస్పీ కె.వి.సత్యనారాయణ సూచించారు. 85వ వార్డు గొన్నా ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం డ్రగ్స్ వల్ల కలిగే హాని, వాటి ప్రభావంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు.డ్రగ్స్‌కు బానిసలుగా మారితే వారి జీవితాలే కాకుండా కుటుంబం మొత్తం అస్తవ్యస్తమవుతుందన్నారు. గంజాయి అక్రమ రవాణాలో ఎక్కువగా కళాశాలల విద్యార్థులు, బాగా చదువుకున్న వారే ఇటీవల కనపడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అక్రమ రవాణా చేస్తూ పోలీసులకు చిక్కిన విద్యార్థుల జీవితాలు అగమ్యగోచరంగా మారాయన్నారు. మత్తు పదార్థాల వల్ల విచక్షణా జ్ఞానం కోల్పోయి నేరాలకు పాల్పడుతున్నారన్నారు. కార్యక్రమంలో పరవాడ సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ కృష్ణారావు, గొన్నా విద్యా సంస్థల కార్యదర్శి గొన్నా హేమచందర్‌నాయుడు పాల్గొన్నారు.

బీసీ గేటు శివాలయం దర్శనానికి అనుమతి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ బీసీ గేటు వద్ద ఉన్న శివాలయానికి భక్తులు వెళ్లడానికి సీఐఎస్ఎఫ్ అధికారుల నుంచి అనుమతి లభించిందని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. మూడో సోమవారం, నాలుగో సోమవారం నాడు బీసీ గేటు నుంచి ప్రవేశానికి అనుమతి ఇచ్చారన్నారు. దర్శనానికి వచ్చే భక్తులు తమ ఆధార్ కార్డులు బీసీ గేటు వద్ద సబ్‌మిట్ చేయాలని తెలిపారు. ఆ రెండు రోజులు ఉదయం 10 గంటల నుంచి దర్శనానికి అనుమతిస్తారని పేర్కొన్నారు. 14 ఏళ్ల లోపు బాలబాలికలను అనుమతించబోరన్నారు. నాలుగో సోమవారం అన్న సమారాధన నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

మొక్కల పెంపకం అవశ్యం



పర్యావరణ ప్రతిజ్ఞ చేస్తున్న సీఐ కేశవరావు, అతిథులు

ఉక్కునగరం: మొక్కలు పెంపకం ద్వారా పర్యావరణ పరిరక్షణ సాధ్యపడుతుందని స్టీల్‌ప్లాంట్ స్టేషన్ సీఐ కేశవరావు అన్నారు. స్థానిక డీపాల్ పాఠశాలకు చెందిన తరుమిత్ర క్లబ్ ఆధ్వర్యంలో సోమ వారం 'గో గ్రీన్– గ్రీన్‌ను విస్తరింప చేయండి – మరిన్ని మొక్కలు నాటండి' అనే స్ఫూర్తిదాయకమైన నినాదంతో మొక్కలు పంచారు. సీఐ కేశవరావు, బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు, కార్పొరేటర్ బి. జగన్, జనసేన నాయకులు జి. సోమన్న సుమారు 3వేల మొక్కలు ప్రజలకు అందజేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఫాదర్ అనీష్ మాథ్యూ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు తమ పాఠశాలకు చెందిన తరుమిత్ర క్లబ్ అనేక కార్యక్రమాలు చేపడుతుందన్నారు. హాజరైన అతిథులు, విద్యార్థులు పర్యావరణ ప్రతిజ్ఞ చేశారు.

ఉత్సాహంగా యువజనోత్సవాలు



యువజనోత్సవంలో విద్యార్థినుల నృత్య ప్రదర్శన

గాజువాక: స్థానిక టీఎస్సార్, టీబీకే డిగ్రీ కళాశాలలో యువజనోత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవాలను ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ప్రారంభించారు. విశాఖ జిల్లాలోని వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొని ప్రతిభ ప్రదర్శించారు. రంగోలి, ఫిజీ క్విజ్, లఘు చిత్రాల ప్రదర్శన, జానపద నృత్యాలు తదితర పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ యువత రాజకీయాల్లో రాణించి దేశ ప్రజలకు నిస్వార్థ సేవలు అందించాలన్నారు. కళాశాల చైర్మన్ టి.బలరామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు ఎల్లప్పుడూ ఉన్నత భావాలను కలిగి ఉండటంతో పాటు ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ టి.ఉమామహేశ్వరరావు, ప్రిన్సిపాల్ ఎస్.విష్ణువర్ధన్‌రావు, వైస్ ప్రిన్సిపాల్ సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

126 మందికి వైద్య సేవలు



శిబిరంలో మాట్లాడుతున్న ఎస్ఆర్ఎంటీ మేనేజర్ వెంకటరావు

అక్కిరెడ్డిపాలెం: ఆటోనగర్‌లోని శ్రీ రామదాసు మోటార్ ట్రాన్స్‌పోర్టు (ఎస్ఆర్ఎంటీ)లో శ్రీ పవన్ సాయి ఆస్పత్రి సహకారంతో సోమవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ట్రక్ డ్రైవర్లు, క్లీనర్లు, కార్యాలయ సిబ్బందికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఎస్ఆర్ఎంటీ సర్వీస్ మేనేజర్ వెంకటరావు, శ్రీ పవన్ సాయి హాస్పటల్ ఎండీ పి.రామారావు మాట్లాడుతూ డిసెంబర్ 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు ట్రక్ డ్రైవర్లకు, క్లీనర్స్‌కు ఉచితంగా ఫైల్స్ పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు. అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు చేస్తామని వెల్లడించారు. శిబిరంలో మొత్తం 126 మందికి వైద్య సేవలందించారు. కార్యక్రమంలో డాక్టర్ కాంచన, ఢిల్లీశ్వరి, రమేష్, పోలినాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.